క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. ట్రాన్స్‌మిషన్ మరమ్మతుల్లో భాగంగా పాంబండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు పాంబండ, ఉసిరికపల్లి, భీమ్లా పంచాయతీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి(తూప్రాన్): ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని శ్రీరాయరావు సరస్వతి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తెలుగు మీడియం విభాగాల్లో ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, జూన్ 1నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు, సైన్స్ విద్యార్థులకు విశాలమైన ల్యాబ్, కళాశాలకు ఆట స్థలం ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

ఏఈఓ రాజశేఖర్‌గౌడ్


తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమశాతం తెలుసుకున్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని చెప్పారు. త్వరితగతిన తూకం వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఐకేపీ సీసీ నర్సింహులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆరోగ్య అధికారులు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం డా.వేదశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి ఓ యాదయ్య తదితరులు పెద్దశంకరంపేటలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రమణ, సాయిలు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గోమారంలో వైభవంగా మహాయాగం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో చతుర్వేత హవనం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వర శర్మ పూజ మహోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. గురువారం చేపట్టిన పూజామహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి పాల్గొన్నారు. శుక్రవారంతో మహాయాగం ముగుస్తుందని పూజారులు శాస్త్రుల ఆయాధ్యరామశర్మ, చండికశర్మ తెలిపారు.

ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలపై వినతి

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలపై పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేసినట్లు పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌లో పీఆర్సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను గురువారం కలిసి కరువుభత్యం, కనీసవేతనం, సీపీఎస్ రద్దు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట హర్షవర్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, ఉమాకర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మొబైల్ ఫోన్ చోరీ

నర్సాపూర్: స్థానిక బస్టాండులో తన మొబైల్ చోరీ అయిందని బాధితుడు మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన సోదరిని బస్సు ఎక్కించే సమయంలో చోరీ జరిగిందని, దాని విలువ రూ.14వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

తొమ్మిదేళ్లుగా శతక్కొడుతుండ్రు

- చదువుతోపాటు ఆటల్లోనూ అదుర్స్
- సత్తా చాటుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు
- 25వరకు ఇంటర్‌లో దరఖాస్తులకు అవకాశం


టేక్మాల్ మోడల్ స్కూల్

'శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుంది' అన్న నానుడి నిజం చేస్తున్నారు గ్రామీణప్రాంత పేదవిద్యార్థులు. విద్యాబోధనలో మెలకువలు పాటిస్తూ ఫలితాల్లో మొదట్లో నిలుస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు టేక్మాల్ మోడల్ స్కూల్ అధ్యాపకులు. క్షేత్రస్థాయిలో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలన్న తలంపుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ స్కూల్స్ మంచి ఫలితాలు సాధిస్తున్నాయి.

– టేక్మాల్(మెదక్)

జిల్లాలో ఏడు ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయగా ఒక్కోపాఠశాలలోను సుమారుగా 820 మందికి విద్యను బోధిస్తున్నారు. ఆరోతరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్లంలోనే విద్యాబోధన నిర్వహిస్తున్నారు. జిల్లాలోని టేక్మాల్‌లోని మోడల్ స్కూల్‌లోనే విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తూ జిల్లాలోనే టాప్‌లో నిలుస్తున్నారు.

ఆటల్లోనూ అదుర్స్..

విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ, ఆటల్లోనూ తమ ప్రతిభ కనభరుస్తున్నారు. మండల స్థాయిని మొదలుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. యోగలో కూడా జాతీయ స్థాయిలో బహుమతులు పొంది అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. వసతులు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ క్రమశిక్షణతోకూడిన విద్యాబోధన ఉండడంతో పాఠశాలల్లో చేరేందుకు డిమాండ్ పెరిగింది.

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఈ విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని 2024–25సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మొదటి సంవత్సరంలో 150సీట్లు అందుబాటులో ఉండగా పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్మీడియెట్లో అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం మోడల్ స్కూల్లో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, ఎంఈసీ 40సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి సంవత్సరం ఆన్లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 25వ వరకు గడువు ఉండడంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. మోడల్ స్కూల్లో 100మందికి ఉచిత వసతి కల్పిస్తారని అధికారులు తెలిపారు.

ఉత్తమ ఫలితాల్లో మోడల్ స్కూల్స్

- క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ పాఠశాలలో పదో తరగతి ప్రారంభమైన 2016నుంచి 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు.
- ఈ ఏడాదిలో పదోతరగతిలో విద్యార్థులు అనూష, నందిని, స్పందన, అన్షిక, ప్రణతి 9.8 జీపీఏ సాధించగా, 60 మందికిపైగా విద్యార్థులు 9 జీపీఏ సాధించారు.
- ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్, పదో తరగతి ఫలితాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించారు.
- ఇంటర్‌లో 93శాతం ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన నరేశ్ 928 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు.
- పాఠశాలలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఆరుగురు ఎంపికయ్యారు.
- అన్ని పాఠశాలల కంటే మోడల్ స్కూల్లోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.
- ముఖ్యంగా ప్రభుత్వ పరిధిలో ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లోను మోడల్ స్కూల్స్ అన్నింటికంటే ఆదర్శంగా నిలుస్తున్నాయి.
- విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో సైతం పట్టు సాధించి ఉన్నత విద్యకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని పొందుతున్నారు.

సమష్టి కృషితో మంచి ఫలితాలు



ఉపాధ్యాయుల సమష్టి కృషితో ప్రతి ఏడాది మంచి ఫలితాలను సాధిస్తున్నాం. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యాబోధన నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లుగా పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఇంటర్మీడియెట్‌లో సైతం మంచిఫలితాలు సాధిస్తున్నాం. చదువుతో పాటు విద్యార్థులు ఆటల్లో తమ ప్రతిభను చూపి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువస్తున్నారు.

– డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, టేక్మాల్


పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి

29న చాకరిమెట్లలో విశేష పూజలు

మాధవానంద సరస్వతి

శివ్వంపేట(నర్సాపూర్): లోక కల్యాణార్థం ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి తెలిపారు. ఆయన గురువారం ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా ముందస్తు పూజాకార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. లక్ష రామ నామ తమలపాకులతో అర్చన, ప్రత్యేక అభిషేకాలు చేపడుతున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయ శర్మ, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, నారాయణరావు తదితరులు ఉన్నారు.

తూకం కోసం నిరీక్షణ

- మూడు రోజులుగా ఎదురు చూపు
- పట్టించుకోని అధికారులు


వర్షానికి తడవకుండా జొన్నలపై కప్పిన కవర్లు

రేగోడ్(మెదక్): రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. రేగోడ్‌లో జొన్నలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులకు సరిపడా బ్యాగులు అందుబాటులో ఉంచి, ధాన్యం తెచ్చిన వెంటనే తూకంవేసి తరలించాలి. కానీ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులు పెడుతున్నారని రైతు గోపస్‌పల్లి అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. జొన్నలు తీసుకొచ్చి మూడు రోజులైనా తూకం వేయడం లేదని, బ్యాగులు ఇవ్వలేదని వాపోయారు. తూకం వేయకపోవడంతో ఉన్నచోటే మొలకెత్తే అవకాశం ఉందని, సమస్యను ఏఓ జావీద్‌కు ఫోన్‌లో వివరించామని రైతులు తెలిపారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఓ జావీద్‌ను వివరణ కోరగా రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

ధాన్యం తరలించడం లేదు..

- నిరసన వ్యక్తం చేసిన రైతులు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్


నిరసన తెలుపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని తరలించడం లేదంటూ రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ మండల పరిధి చండి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అవుతున్నా తూకం వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు వాపోయారు. అకాల వర్షాల మూలంగా ఇబ్బందులు పడుతున్నామని, ధాన్యం కుప్పలు తడవకుండా కాపాడుకునేందుకు అద్దెకు కవర్లు తీసుకురావడం వల్ల ఆర్థికభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కేంద్రం నుంచి ధాన్యం త్వరగా తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయం గురించి పీఏసీఎస్ సీఈఓ మధును వివరణ కోరగా లోడింగ్ చేసిన ధాన్యం లారీలు ఖాళీ కాకపోవడం వల్ల ఆలస్యం అవుతుందన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్

మెదక్ మున్సిపాలిటీ: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మెదక్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రమేశ్‌కు రైతుల పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మాజీ రైతుబంధు అధ్యక్షుడు సోములు మాట్లాడుతూ వ్యవసాయానికి కరెంటు, నీళ్లు ఇవ్వకుండా అన్నదాతను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ధాన్యం కొనకుండా గోస పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తడుస్తుంటే పట్టించుకోని సర్కారు తీరును చూసి అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారన్నారు. క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామని ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. రైతుబంధు, రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. రైతుల హక్కులను హామీలను సాధించేవరకు రైతుల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాయ మల్లేశం, జగన్, బాలరాజు, కిషన్, రమేష్, రైతులు రామయ్య, పవన్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీర బ్రహ్మేంద్రుడి జాతర


బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో వీర బ్రహ్మేంద్రస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ప్రత్యేక పూజలు, బండ్ల ఊరేగింపు నిర్వహించారు. జాతరలో బండ్ల ప్రదర్శనను చూసేందుకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలి రావడంతో బ్రహ్మంగారి మఠం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వర్షం కురిస్తేచాలు.. కరెంట్ కట్

నర్సాపూర్: నర్సాపూర్‌లో కురిసిన వర్షానికి సుమారు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కురువగానే పట్టణంలో కరెంటు సరఫరా నిలిచిపోవడం సర్వసాధారణమైందని గురువారం పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల కొమ్మలను మామూలు సమయంలో కొట్టివేయాలని కోరారు. వర్షంతో గాలులు వీయడంతో కొమ్మలు కరెంటు వైర్లకు తగిలి సరఫరాకు అంతరాయం కలుగుతోందని, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వినియోగదారులు సూచించారు. ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా విద్యుత్ వైరు తెగిపోవడంతో మరమ్మత్తులు చేసేందుకు సరఫరా నిలిపివేశామని చెప్పారు. అనంతరం పలుచోట్ల చెట్లకొమ్మలు పడడంతో అంతరాయం ఏర్పడిందని, వాటిని తొలగించి కరెంటు సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.

బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్‌లో విద్యార్థుల ప్రతిభ


బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాస్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్‌లో మెదక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ దినకర్ తెలిపారు. గురువారం స్థానిక ఆటోనగర్‌లోగల ఆర్ఎస్‌పీ ఫంక్షన్ హాల్‌లో రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎగ్జామ్‌కు ఆర్ఎస్ఎస్ఏఐ వ్యవస్థాపకుడు, సీనియర్ మాస్టర్ నగేశ్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 50మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. పోటీల్లో విశిష్ట రాజ్, ఇందు, శ్రీహర్షిత, విధాత్రి, అక్షర, మణివర్ధన్, శ్రీరాజ్ రెడ్డి, స్వరూప్, దుర్గ ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వారు 5సంవత్సరాలుగా శిక్షణ పొందినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నగేశ్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యాసాగర్, మల్లేశం, ప్రసన్న, ఐశ్వర్య, అబ్దుల్లా పాల్గొన్నారు.

చేగుంట మండలంలో భారీ వర్షం



రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

చేగుంట(తూప్రాన్): చేగుంటతోపాటు పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

మెదక్ ఎంపీ స్థానం బీజేపీదే..

జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్


స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ నేతలు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ ఎంపీ స్థానం బీజేపీనే గెలుస్తుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం చిన్నశంకరంపేటలో బీజేపీ కార్యకర్తలతో కలిసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావుతోపాటు మరో 8ఎంపీ సీట్లను బీజేపీ గెలవబోతుందన్నారు. కార్యక్రమంలో పోగుల రాజు, సురేష్‌గౌడ్, అశోక్, మూర్తి పెద్దులు, నరేందర్‌రెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టీచర్లపై లాఠీచార్జి అప్రజాస్వామికం

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై ఆర్‌డీఓ అనుచితంగా వ్యవహరించి లాఠీచార్జికి ప్రేరేపించడం అప్రజాస్వామికమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజవర్గంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న ఉపాధ్యాయులకు కేవలం రూ.2400 చెల్లించారన్నారు. ఇతర జిల్లాల్లో మాదిరిగా రూ.3150 చెల్లించాలని అడిగినందుకు లాఠీచార్జికి దిగడం దారుణమని వాపోయారు. ఆర్‌డీఓ, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సత్యనారాయణ, కిరణ్‌కుమార్ ఉన్నారు.

జెడ్పీటీసీ ఆర్థిక సాయం



శివ్వంపేట(నర్సాపూర్): బాధిత కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లకు చెందిన బానోత్ తుక్యానాయక్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.5 వేలు సాయం అందజేశారు. అలాగే ఉసిరికపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ, భానుప్రసాద్ విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట కృష్ణారావ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, దశరథ్, ఎల్లయ్య, పాపయ్యచారి తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షురాలి కుటుంబ సభ్యులకు ఆ పార్టీ స్థానిక నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షురాలు పెద్దలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆపార్టీ మండలశాఖ అధ్యక్షుడు వడ్లనవీన్, యూత్ నాయకుడు సంద్రగు శ్రీకాంత్ బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు వారు తెలిపారు.

అనారోగ్యంతో జీపీ వర్కర్ మృతి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో పంచాయతీ వర్కర్ ముత్తోల్ల బాబు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆయన కొంత కాలంగా పెరాల్సిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సుజాత స్పందించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పూజలు

చేగుంట(తూప్రాన్): బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలవాలని కోరుతూ మహారాష్ట్ర మహోర్‌గాడ్ రేణుకమాత ఆలయంలో మండల నాయకులు పూజలు నిర్వహించినట్లు తెలిపారు. గురువారం ఎంపీటీసీ బింగి గణేశ్, చందాయిపేట మాజీ ఉప సర్పంచ్ సంతోష్, ఆలం శ్రీకాంత్ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన చిలప్‌చెడ్ మండలంలోని గంగారం తండాలో గురువారం చోటు చేసుకుంది. తండాకు చెందిన శ్రీను నాయక్‌కు చెందిన ఎద్దు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది. సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు నాయక్ కోరాడు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు



చిన్నశంకరంపేట (మెదక్): బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చందంపేట గ్రామానికి చెందిన దాస్ చిన్నశంకరంపేటకు వస్తుండగా ఆస్పత్రి సమీపంలో బైక్ అదుపుతప్పి పోల్‌ను ఢీకొట్టాడు. ఇదే సమయంలో అటువైపు వెళుతున్న జెడ్పీ చైరపర్సన్ హేమలత ఆయువకుడిని ఆస్పత్రికి తరలించేందుకు సహకరించారు. మెరుగైన వైద్యం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు మెడికల్ ఆఫీసర్ సాయి సింధు తెలిపారు.